వార్డులోకి అడుగుపెడుతూనే అప్రయత్నంగా అలవాటుగా ఆ మంచం ఉన్న వైపుకు చూశాను. మంచంమీద వరుపు లేదు. వుండదు.

# ఆత్మశాంతి

డాక్టర్ కె.వి. కృష్ణకుమారి

ఆ చోటు నిర్జీవంగా వుంది. వుండాల్సిన జీవి లేదు.

మనసు కలుక్కుమంది. గుండె బరువుగా ఏదోలా అనిపించింది. ఆ మంచం మీద వుండాల్సిన రోగి అపరిచితుడు కాడు. ముఖ పరిచయంలేని వ్యక్తి కాడు. ఎప్పుడూ తన గురించి కాక తనవాళ్ళనుకుంటున్న వాళ్ళ గురించీ, తను నమ్ముకున్న వాళ్ళగురించీ ఆందోళనపడుతూ నా దగ్గరకు వచ్చేవాడు. వైద్యపరంగా కావల్సినంత భరోసాని మోసుకుని తృప్తిగా వెళ్ళిపోయేవాడు.

"మీకు నాఅన్నవాళ్ళు లేరుగా ఎందుకీ తాపత్రయం? అనవసరంగా రక్తపోటును పెంచుకోటమెందుకూ?"

ఎప్పుడైనా మందలింపుగా అంటే ఆ అరవై ఏళ్ళవృద్ధుడూనిండుగా,నిశ్చింతగా నవ్వేవాడు.

"ఎంత మాటన్నారు డాక్టరుగారూ. నాకెవ్వరూ ఎందుకు లేరు? భార్యా బిడ్డ లుంటేనేనా నా వాళ్ళున్నారనుకోవల్సింది? ఏమో వాళ్ళున్నా నిజంగా నిజాయితీగా నన్ను చూస్తారన్న నమ్మకం ఏముంది? నా అన్నయ్య కుటుంబం వుంది. వాడి ఆపేక్ష వుంది. వాడి కొడుకుని నా కొడుకులా గుండెలమీద పెట్టుకుని పెంచి పెద్దవాడ్ని చేశాను. వాడు ప్రయోజకుడు అయ్యాడు. నా ప్రాణాలన్నీ ఆ కుటుంబంమీదే పెట్టుకుని బ్రతుకుతున్నాను. నాకు కావల్సిందేముంది? గుప్పెడు మెతుకులూ, కాస్తంత నీడ. పోయేముందు నా కోసం వాళ్ళు విడిచే రెండు కన్నీటి చుక్కలూ.

డాక్టర్‌గారూ- నేను బ్రతికినంతకాలం నా కోసం బ్రతకలేదు. ఐనా ఆత్మతృప్తితోనే బ్రతుకుతున్నాను. పోయేముందూ ఆత్మతృప్తి ఎలాగూ వుంటుంది.నావాళ్ళు నాకున్నారు కనుక ఆ ఆత్మతృప్తి నాకు చాలు. ఎందుకంటే పోయాక ఏ జంతువైనా ఏదో విధంగా ఎవరికో ఒకరికి ఉపయోగకరంగానే వుంటుంది. కానీ ఈ మానవదేహం బ్రతికినంతకాలమేకదండీ! పోయాక అవతలికి ఈడ్చిపారేస్తారు. అందుకే అప్పుడప్పుడు అనుకుంటూ వుంటాను. వచ్చే జన్మలో ఏ జంతువుగానో అదీ చచ్చాక కూడా ఉపయోగపడే జంతువుగానో పుట్టినా విచారించాల్సిన అవసరం ఏమాత్రం వుండదని. ఎందుకంటే మనిషిగా అటువంటి తృప్తి దొరకడం కష్టం కాబట్టి. "విసిగించటం లేదు కదండీ."

లోతుకుపోయిన ఆ గాజుకళ్ళల్లోని తెలియని ఆపేక్ష, ఆ అమాయకత్వం, నా కాలాన్ని ఖర్చుపెట్టనిచ్చేది విసుగును దూరం చేసేది.

సరిగ్గా పదిరోజుల క్రితం వార్డ్‌బాయ్, మరి కొందరి సహాయంతో ఇతడ్ని అవుట్ పేషెంటు డిపార్ట్‌మెంట్‌కి దాదాపు ఎత్తుకుని తీసుకువచ్చారు


ఎముకలగూడులా కళ్ళల్లో జీవం, వొంట్లో ప్రాణం లేనట్టున్న ఇతడ్ని గుర్తుపట్టలేకపోయాను.

"అమ్మా ప్రొద్దున్ననగా ఎవరో ఆటోలో ఈయన్ని తీసుకువచ్చి హాస్పిటల్లో వదేసి వెళ్ళిపోయారు. చేతిలో చీటీ వుంది అందులో మీ పేరుంది. అందుకే మీరొచ్చేదాకా కావలా కాస్తున్నాం."

వార్డ్‌బాయిస్ ఆ నాలుగు ముక్కలూ చెప్పి తమ బాధ్యత తీర్చుకున్నారు. మూసిన అతని గుప్పెట్లో కాగితపు మడత కన్పించింది.

ఆ ఉత్తరం నన్ను ఉద్దేశించి వ్రాసినది. అతని అన్నగారు వ్రాసింది.

తమ్ముడు మాధవరావు చావు బ్రతుకుల్లో వున్నాడనీ ఇంటి పరిస్థితులు చాలా దారుణంగా వుండటం వల్ల తను నిస్సహాయ స్థితిలో వున్నాననీ ఇతడ్ని హాస్పి





టల్లో చేర్పించి సరైన మందులు ఇప్పించి ఆదుకోమనీ ఆ ఉత్తరం సారాంశం.

సాధారణంగా అటువంటి కేసుని వెన కాల ఆదుకునేవారు లేక అటువంటి స్థితిలో వున్న వారిని హాస్పిటలో చేర్చుకోవా లంటే ఇబ్బందితో కూడిన విషయం.కానీ మానవతా దృక్పథంతో నా పేరవున్న ఉత్తరం అందటోనూ సూపరింటెండెంట్ గారు మాధవరావుని హాస్పిటల్లో చేర్చు కున్నారు.

కొడిగట్టిన దీపంలా వున్న ఆ ప్రాణి కళ్ళలో వెలుగు రావటానికీ, మాట రావ టానికీ,మనిషి కావటానికి అహోరాత్రులు కృషి చేశాము.మా ధర్మాన్ని సక్రమంగా నిర్వహించగలిగామన్న తృప్తిని మాలో మిగల్చటానికి అతను కళ్ళు తెరి చాడు. కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఆహారం తీసుకున్నాడు. ప్రక్కవాళ్ళతో మాటలు కలుపుకున్నాడు. మంచితనంతో పరిచయాల్ని పెంచుకున్నాడు.

నేను రౌండ్సుకి వెళ్ళినప్పుడల్లా ఆ కళ్ళు ఆనందంతో వెలిగేవి. బోసి నోటి నిండుగా నిండైన నవ్వు పలకరించేది. కృతజ్ఞతాపూర్వకమైన ఆరాధన కన బరిచేవాడు.

"పాపం. రోజూ అందరికోసం అందరూ వస్తారు డాక్టరుగారూ.... ఈయన కోసం ఎవ్వరూ రారండీ. గుమ్మం వంక అలా చూసి చూసీ దిగులుతో పడుకుంటు న్నాడు. అర్థరాత్రులు తన కెవ్వరూ లేరని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు. ఆ దిగులు తోనే తిండి తినకుండా చిక్కి శల్యమై పోతున్నాడు."

ప్రక్క పేషెంట్సు నేను వెళ్ళినప్రతీ సారీ తడుముకోకుండా చెప్పేవాళ్ళు.అతని పరిస్థితికి సానుభూతిని చూపించేవాళ్ళు.

"ఏమండీ మాధవరావుగారూ...."

ఆయన కళ్ళల్లో నీళ్ళుతిరిగేవి.


"....ఇంటిపరిస్థితులు బావుళ్ళేదమ్మా. అందుకని వచ్చివుండరు బహుశా. మీరు న్నారు కదా అన్న ధైర్యం కూడా వుండి వుంటుంది."

ఆశ చావని విశ్వాసం అతని కళ్ళల్లో కనిపించేది. భయంకరమైన ఒంటరితనం ఆ విశ్వాసం చాటున దాగలేకపోయేది. అడుగు చప్పుడుకే ఆ అలసిన మనసు ఉలిక్కిపడేది. మరుక్షణమే నిరాశతో ముకుళించుకు పోయేది.

"ఇంతవరకూ వాళ్ళు దాచుకోలేదు.నా కోసమంటూ నేనేమీ దాచుకోలేదు. మరి నా వాళ్ళెందుకు మొహాల్ని దాచేస్తు న్నారు...."

ఆఖరి క్షణాల్లో అందుకోబోయే ఆత్మీ యత కోసం చివరికి ఆరోగ్యాన్ని కూడా ధారపోసుకున్న మనిషి.

తనకంటూ పిల్లలుండే తను పెంచు తున్న అన్నకొడుకుక్కెక్కడ అన్యాయం జరుగుతుందోనని బ్రహ్మచారిగానే వుండి పోయిన మనిషి. మనసూ- మమతా- మమకారాలూ తప్ప మనుష్యుల మధ్య




మరేవీ వుండకూడదనీ- వుండవనీ ప్రగాఢంగా నమ్మిన పిచ్చిమనిషి.

తనకేం మిగిలిందో ఏం పోగొట్టుకున్నాడో మనిషికి అసలైన నిర్వచనం ఏమిటో అనుభవపూర్వకంగా అర్థం చేసుకుంటుంటే మనసు వికలమైపోయింది.

"అమ్మా- రేపు శలవు పెడతారా?- ఐతే రేపు రారా?"

జీవకళ ఏ మాత్రం లేని ఆ కళ్ళల్లో భయంకరమైన దిగులు మబుకు కన్పించింది.

"ఎల్లుండి వస్తాను- ఈ పది రూపాయలూ వుంచండి...."

అతని కళ్ళల్లో నీళ్ళు పొంగాయి.

"మీకేం చేశానని? నేను మీకేం చేశానని..."

మాటలు తడబడి బేలగా నోటందుకుంటున్న అతన్ని జాలిగా చూశాను.

"మనిషిని మనిషి ఆదుకోటానికి ఏదైనా చేసివుండాలా? ప్రతిఫలం వుంటేనే మనిషికి సహాయపడాలా? మీరున్న స్థితిలో.... ఈ మాత్రమేనా చెయ్యటం నా ధర్మం. అలా చెయ్యకుండా వుండలేకపోవడం నా స్వభావం" అతని పక్కమీదున్న భగవద్గీతను పాలోచనగా చూస్తూ అన్నాను.

"మీ వాళ్ళు తప్పకుండా వస్తారు. మానవత్వం వున్నవాళ్ళెవ్వరూ- మిమ్మల్నీ స్థితిలో ఇలా వదిలెయ్యరు. మీరు పెంచి పెద్దచేసిన వాళ్ళకి మానవత్వం వుండదని నేను నమ్మను."

ఆ మర్నాడెలాగూ రానని ఒక ఐదు నిముషాలు ఎక్కువ గడిపాను మంచం దగ్గర. ఆ మాత్రం దానికే అతని మనసు పొంగిపోయింది. ఆ ఓదార్పుకే అతని గుండె నిండిపోయింది.

"నాకా నమ్మకం వుందమ్మా. కనీసం తులసినీళ్ళు పొయ్యటానికైనా వస్తారు. తలకి కొరివి పెట్టటానికైనా వస్తారు.... నా మనసు నన్ను మోసం చేస్తుందా?"

చెయ్యదన్న ధైర్యాన్నే అతన్లో కలిగించాను.

"ఏమిటోయ్.... పేషెంట్‌కు లెక్చరిస్తున్నావు!"

నా కొలీగ్స్ ఎగతాళి చేస్తుంటే నవ్వి ఊరుకొన్నాను.

చదువూ సంస్కారం వున్న మనిషి, అందులోనూ అతనున్న స్థితి చాలా దయనీయమైనది. ఈమాత్రం వోదార్పు నందివ్వటానికి ఎన్ని నిముషాలు ఖర్చుపెట్టినా నిష్ఫలం కాదు. అది నా నమ్మకం.....

"డాక్టర్.... పాపమా మాధవరావు గురించా?"

ఉలిక్కిపడి చూశాను.

నా కొలీగ్ డాక్టర్ విజయకుమార్ కేస్‌షీట్ వ్రాస్తూనే చిన్నగా అన్నాడు.

"నిజంగా మీరు కథ వ్రాసి తీరాల్సినంత స్టోరీ జరిగింది. నిన్న మీరు లేరు కదా- నిద్దర్లో పాపమతని ప్రాణం ఎప్పుడు పోయిందో.... తెల్లారాక కానీ కనిపెట్టలేకపోయారు. రాత్రంతా- దిగులుతో కుమిలిపోయాట్ట. పాలుకానీ, బ్రెడ్ కానీ తీసుకోలేదుట. ప్రక్కవాళ్ళతో కూడా మాటా మంతీ లేకుండా అలాగే పడుకున్నాట్ట.

అతను చెప్పిన అడ్రస్ ప్రకారం- వాళ్ళింటికి మనుష్యుల్ని పంపిచాము. శవాన్ని తీసుకువెళ్ళమని కబురు చేశాం.

విషయం విని పట్టనట్టు కూర్చున్నార్ట. మునుకుపోయే ఇబ్బందుల్లో వున్నామనీ శవం బాధ్యతను హాస్పిటల్‌వాళ్ళనే చూసుకోమనీ చెప్పి పంపించార్ట."

విషయం చెప్తుంటే డాక్టర్ విజయకుమార్ మొహం ఎర్రబడటం గమనించాను.

నా భావాల్ని కనపడనీయకుండా తల వంచేశాను.

"ఉస్మానియాకి ఫోన్ చేశాం. శవాన్ని మార్చురీలో పెట్టటానికి పంపిస్తున్నామని. వాళ్ళ వెహికల్ లేదు సమయానికి. శవాన్ని యాంబులెన్స్‌లో పంపలేం కదా.... నేనూ సూపరింటెండెంట్‌గారు అరవై రూపాయలిచ్చి- ఆటోలో శవాన్ని పంపించాము మార్చురీకి."

అతని మానవత్వం ముందు మరింత తల వంచాను.

"డాక్టర్‌గారూ- ఆ తరువాత జరిగిన విషయం మీ కథకు మరింత పనికొస్తుందనుకుంటాను."

అతని మనసులోని భావాలు తమాషగా విన్పించాయి.

"శవాన్ని పంపాక మాధవరావు అన్నయ్య వచ్చాడు. శవం కోసం కాదు. ఆ శవం జేబులో మిగిలిపోయిన డబ్బు కోసం, ఆ శవం వదిలివెళ్ళిన సామాన్ల కోసం. ఈ రావటమే అతను బ్రతికున్నప్పుడు వచ్చుంటే!.... ఛీ! ఛీ! ఏం మనుష్యులు! ఎక్కడి రక్త సంబంధం?"

నా మనసు ఊ కొట్టడం మానేసింది. నా మస్తిష్కం ఆలోచించటంమానేసింది. నిజానికి అతనొక పేషెంట్. వృత్తిపరంగా మేము చూసే వేలాది రోగులలో అతనొకడు. ఒకటికి రెండుసార్లు చూసి మాట్లాడిన పరిచయం మాది. అంతే. కానీ- అతని పంటరితనం మమ్మల్ని కదిలించింది. అతని అమాయకత్వం మమ్మల్ని కరిగించింది. పగవాళ్ళకూ్కడా వుండకూడని అతని నిస్సహాయస్థితి మాలో జాలిని నింపింది.... ఇప్పుడింతగా

ఆలోచింపజేస్తోంది.

"....శవాన్ని మార్చురీ నుంచి కూడా తీసుకువెళ్ళటానికీ- ఆ ఖర్చు భరించటానికీ వాళ్ళు సిద్ధంగా లేరుట. ఐతే శవాన్ని అనాటమీ థియేటర్‌కి పంపుతారని చెప్పాము. అతను నా మాట విన్నాక కాస్త శాంతించినట్టయి వెళ్ళిపోయాడు.... దిక్కులేని శవాలకి...."

ఏదో చెప్పబోతూ నేను మాట్లాడక పోవడం గమనించిన డాక్టర్ విజయ కుమార్ మాటల్ని మధ్యలోనే ఆపేశారు.

తన వాళ్ళంటూ వున్నారనీ-తన కోసం ఏదైనా చేస్తారనీ.... తను చేసినదానికి శవ సంస్కారమైనా చేసే సంస్కారం వాళ్ళకుంటుందనీ గుడ్డిగానమ్మిన మంచి మనిషి చివరిదశలో వంటరితనంతో ఎంతటి దుర్భర నరకం అనుభవించాడు.

పిల్లలు లేకపోయినా అన్న కొడుకును తన కొడుకులా పెంచి పెద్దచేసి అతని ప్రయోజకత్వానికి మురిసిపోయి, అతని అనారోగ్యానికి తల్లడిల్లిపోయిన ఒక అమాయక ప్రాణి కోరుకున్నట్టు జరిగిందా?

తులసి తీర్థంపోసే నాథుడు రాకపోయినా-దహన సంస్కారం చేసే శక్తీ, ఓపికా అవసరంలేని తన వాళ్ళను తలుచుకుని ఆ ఆత్మ ఎంత క్షోభిస్తుంది! ఎంత నరకయాతన పడుతుంది?

చివరిదశలో తన కోసం కన్నీరు పెట్టగల ప్రాణిని చూద్దామని ఆ ప్రాణం ఎంత కొట్టుకుపోయినా- ఆ కోరిక తీరకపోయినా-

కనీసం దహన సంస్కారాలైనా తనకు జరగాలన్న అతని కనీస కోరికైనా తీరితే.... తీర్చగలిగితే!

ఎవరు? ఎలా!

ఎంతోసేపు ఆలోచించాక ఒక నిర్ణయానికి వచ్చాను.

ఆ శవాన్ని తరలించటానికి- దహన సంస్కారానికి కావల్సిన డబ్బును వాళ్ళ వాళ్ళకందించే ఏర్పాట్లను చెయ్యటానికి- నేను ముందుకు వస్తే....

మమతా- మమకారం- మానవత్వం లాంటి వాటికి లొంగకపోయినా- కనీసం డబ్బుకైనా ఆ దుర్మార్గులు లొంగగలిగితే ఒక అనాథప్రేతానికి న్యాయం జరుగుతుందేమో.

ఏమో!

అనిశ్చయ పరిస్థితుల్లో ఎటూ తేల్చుకోలేక సతమతమౌతున్న నా కళ్ళ ముందు- ఆప్యాయత కోసం తల్లడిల్లిపోయిన మాధవరావు కన్పించాడు.

దిక్కు లేకుండా తరలించబడ్డ ఆ శవం తాలూకు దృశ్యాలు కదిలాయి. అనాటమీ టేబుల్‌మీద వైద్య విద్యార్థుల కోసం చేరవేయబడ్డ దయనీయ దృశ్యం కన్పించింది.

ఆ శవాన్ని అణువణువునా స్కాల్పెల్‌తో చీల్చి- విడదీసి- చదివి నేర్చుకుంటున్న వైద్య విద్యార్థుల గుంపు కన్పించింది.

మనసు మూగబోయింది.

కర్తవ్యం అయోమయమయింది.



ఐనా ఒక నిశ్చయంతో అనాటమీ థియేటర్ దాకా వచ్చిన నా మనసు అప్పుడే మేల్కొందేమో....

మనస్సాక్షి అప్పుడే పనిచెయ్యడం మొదలుపెట్టిందేమో....

అందుకే కాళ్ళు ముందుకు సాగ లేదేమో....

శవం వున్న ప్రతీ టేబుల్ చుట్టూ వైద్య విద్యార్థులు ఆత్రంగా చదువు కుంటున్నారు. తమకు కేటాయించిన శరీర భాగాలను దగ్గర పెట్టుకుని వాటిని కోసి- శరీర నిర్మాణాన్ని- అనాటమీని క్షుణ్ణంగా చదువుకునే ప్రయత్నంలో వున్నారు. భావి జీవితంలో మానవకోటికి శక్తివంచన లేకుండా సేవ చెయ్యగల స్తోమతను నిజాయితీతో సంపాదించు కోవాలనే అత్యున్నత దీక్షతో వున్నారు.

మాధవరావు శరీరం కూడా....ఇలాగే ఉపయోగపడుతుంది.

ఇలాగే భావి వైద్యులకు విద్య నేర్పు తుంది. ఇలాగే ముందు తరాలవారికి పరోక్షంగా సహాయపడుతుంది.

ఆ శరీరంలోని ప్రతీ భాగం, ప్రతీ అణువూ విద్యార్థులకి పాఠాలు నేర్పు తుంది. గుండె ఊసుల్ని చెప్పలేకపోయినా గుండె నిర్మాణాన్నికళ్ళముందుంచుతుంది. ఆ మెదడు పడిన వేదనను- విద్యార్థులు అర్థం చేసుకోలేకపోయినా- మెదడుకు సంబంధించిన ఎన్నో అంశాలను విద్యా ర్థులకు బోధించబోతోంది.

ఆ తరువాత ఎముకలు కూడా వృధా కావు.

తరతరాల,భావితరాల వైద్య నిపుణుల చేతుల్లో ఒక పవిత్ర ప్రయోజనం కోసం ఉద్దేశింపబడి సార్థకతను సంతరించుకో బోతున్నాయి.

వెంటనే మాధవరావు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"పోయాక ఏ జంతువైనా ఏదో విధంగా ఎవరికో ఒకరికి ఉపయోగకరం గానే వుంటుంది. కానీ ఈ మానవదేహం బ్రతికినంతకాలమే కదండీ.... పోయాక అవతలికి ఈడ్చి పారేస్తారు. అందుకే అప్పుడప్పుడు అనుకుంటూ వుంటాను. వచ్చే జన్మలో ఏ జంతువుగానో ....అదీ చచ్చాక కూడా ఉపయోగపడే జంతువు గానో పుట్టాలని. ఎందుకంటే మనిషిగా అటువంటి తృప్తి దొరకటం కష్టం కదా!"

నా కళ్ళు తెరచుకున్నాయి.

వివేకం హెచ్చరించింది.

ముక్కలబడితో - విధిలేనట్టు చేసే దహన సంస్కారంవల్ల ఆత్మ అంటూ బ్రతికుంటే అది సంతోషిస్తుందనుకోటం ఎంత అవివేకం?

తన కోరిక ప్రకారం.... పోయాక కూడా ఈవిధంగా....భావి వైద్యులకు ఉప యోగకరంగా ఆ శరీరం ఉపయోగ పడటం ఎంత యాదృచ్ఛికం!

ఈ తృప్తి ఆత్మను తిరిగి బ్రతికించి తీరుతుంది.

తిరిగి చంపించి నేను పాపం కట్టుకో లేను- కట్టుకోను.

"నో ఐ షుడ్ నాట్!"

ఆ దృఢ నిశ్చయం నా మనసునెంతో తేలికపరిచింది.

ఒక ఆత్మకు శాంతి దొరుకుతుందనే తృప్తి మనసును నింపింది-నా కది చాలు!

●


దీపావళి శుభాకాంక్షలతో

ప్రజల సేవయే మా కర్తవ్యం

నిత్యావసర వస్తువుల పంపిణీలో, కిలో రెండు రూపాయల బియ్యం పంపిణీలో విజయఢంకా మ్రోగిస్తున్న

"కడప వినియమదారుల సహకార సెంట్రల్ స్టోర్స్"

డోర్ నెం : 6/304 A. జ్యోతి గోవిందప్ప వీధి,

కడప

ప్రెసిడెంట్ : జి. ఈశ్వరరెడ్డి

బ్రాంచి : రాయచోటి, లక్కిరెడ్డిపల్లి కడప పట్టణంలో రిటైల్ అవుట్‌లెట్స్ :
(1) శంకరాపురం, (2) చిన్నచౌకు, (3) బుడ్డారుపల్లె, (4) పక్కీర్ పల్లె, (5) మృత్యుంజయకుంట, (6) చెమ్మిమిర్యాపేట, (7) సాయిపేట.

క్లాత్ సెంటర్ : మహిళా సూపర్ బజార్